ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
సోమవారం, 14 ఏప్రిల్ 2025



భద్రాద్రి జిల్లా పెనగడప ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తడిచిన వరి ధాన్యం



ఖమ్మంలో వర్షం పడుతున్న దృశ్యం

ఉదయం ఎండ.. రాత్రి రండా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గాలివాన బీభత్సం

- పలు చోట్ల రోడ్లపై కూలిపోయిన చెట్లు
- విద్యుత్ స్తంభాలు విరిగిపడి సరఫరాకు అంతరాయం
- వైరాలో పిడుగుపడి అంగన్ వాడీ కేంద్రంలో సామగ్రి దగ్ధం

ఖమ్మం/కొత్తగూడెం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం సాయంత్రం పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. పగటి వేళ తీవ్రమైన ఎండతో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా సాయంత్రం పలు ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి గాలిదుమారంతో వర్షం కురిసింది. ఖమ్మం నగరంతో పాటు ముదిగొండ, కొణిజర్ల, వైరా, తల్లాడ, మధిర, పెనుబల్లి, సత్తుపల్లి మండలాల్లో వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా వైరాలో 1.4 సెం.మీ వర్షపాతం నమోదుకాగా, సత్తుపల్లిలో 1.38 సెం.మీ, ముదిగొండలో 1.1సెం.మీ, మధిరలో 1.08 సెం.మీ వర్షపాతం నమోదైంది. వైరా మండలం గరికపాడులో ఇంటిపైన రేకులు ఎగిరిపోయాయి. కృష్ణాజిల్లా నెమలి, గన్నవరం రోడ్డులో తాడిచెట్లు విరిగిపడ్డాయి. వైరాలోని 14 వార్డులో అంగనవాడీ (మిగతా 4వ పేజీలో)



వేసవిలోగా కాల్వల ఆధునీకరణ చేపట్టాలి

- పూడికతీత, మరమ్మతు పనులు పూర్తిచేయాలి
- చివరి ఆయకట్టుకు నీరందేలా ప్రణాళికలు రూపొందించాలి
- ఎన్నెస్పీ సీఈ రమేష్‌కు మంత్రి తుమ్మల ఆదేశాలు

ఖమ్మం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గత ఆగస్టులో వచ్చిన అకాల వర్షాలు, వరదల కారణంగా సాగర్ కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మే నెలాఖరునాటికి ఆ కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఖమ్మం, సూర్యాపేట ఎన్నెస్పీ సీఈ రమేష్‌బాబుతో ఆయన ఆదివారం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ చివరి ఆయకట్టు భూములకు సైతం నీరందించేలా ప్రణాళికబద్ధంగా ముందుకుసాగాలన్నారు. గత వరదల సమయంలో కాల్వలకు భారీగా నష్టం వాటిల్లిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పలు కాల్వలు, చెరువులు గండ్లు పడి దెబ్బతిన్నాయన్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా ఆయా కాల్వల మరమ్మతు చేపట్టాల్సి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో కాల్వలను పరిశీలించి పూడికతీత, మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. అవసరమైన అన్నిచోట్ల కాల్వ కట్టలను బలోపేతం చేయడంతోపాటు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలన్నారు. నాణ్యత పనుల్లో (మిగతా 4వ పేజీలో)

వనజీవి.. ధన్యజీవి

- మొక్కల ప్రేమికుడికి అశ్రునయనాలతో వీడ్కోలు
- స్వగ్రామం రెడ్డిపల్లిలో దరిపల్లి రామయ్య అంత్యక్రియలు పూర్తి
- అంతిమ యాత్రకు తరలివచ్చిన అభిమానులు, పలువురు అధికారులు
- రామయ్య పాడె మోసిన రూరల్ తహసీల్దార్, కమిషనర్
- నివాళులర్పించిన మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, ఖమ్మం సీపీ సునీల్‌దత్



నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జానమ్మను ఓదార్చుతున్న మంత్రి



ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ ప్రేమికుడు, పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్యకు కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో ఆదివారం తుది వీడ్కోలు పలికారు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో వనజీవి రామయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలను ఆదివారం రామయ్య స్వగ్రామం రెడ్డిపల్లిలో నిర్వహించారు. అంతిమయాత్రలో ఖమ్మం రూరల్ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిలు రామయ్య పాడె మోశారు. ఖమ్మం జిల్లా ఫారెస్టుశాఖ డీఎఫ్‌వో సిద్దార్థ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్‌రెడ్డి అధికారులు, సిబ్బంది సుమారు 50మంది హాజరై రామయ్య అంతిమయాత్రలో పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి నివాళి..

వనజీవి రామయ్య భౌతికకాయాన్ని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, ఖమ్మం సీపీ సునీల్‌దత్‌లు సందర్శించి నివాళులర్పించారు. వనజీవి సతీమణి జానమ్మను ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వనజీవి రామయ్య మృతి చాలా బాధాకరమన్నారు. రామయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున కూడా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి మనిషి తాను జీవించినంత కాలం ఏదో ఒకటి సాధించారన్న ఆలోచన చేయాలన్నారు. వనజీవి రామయ్య (మిగతా 4వ పేజీలో)



మధిరలో రూ.128 కోట్లతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి శంకుస్థాపన చేసిన భట్టి

అభివృద్ధిలో మధిరను ఆదర్శంగా నిలుపుతా

- రూ.128 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీకి శంకుస్థాపన
- రెండేళ్లలో పనులు పూర్తి చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిరటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో మధిరను ఆదర్శంగా నిలుపుతానని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మధిరలో రూ.128 కోట్లతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మధిర పట్టణ ప్రజల ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అంటువ్యాధులు ప్రభలకుండా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. దీని ద్వారా మధిర పట్టణంలో ఉన్న 6వేలకు పైగా గృహాలకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మురుగునీరు అంతా దాదాపు వంద కిలోమీటర్ల పైప్‌లైన్‌ల ద్వారా నాలుగు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లకు చేరుకుని అక్కడ నీటిని శుద్ధి చేసి వ్యవసాయం, రోడ్ల వెంబడి చెట్ల పెంపకానికి ఉపయోగిస్తామన్నారు. ఈ పథకం పూర్తయితే మధిరలో మురుగు వాసనే ఉండదన్నారు. రెండేళ్లలో ఈ పథకాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలన్నారు. అనంతరం అధికారులతో మధిర పట్టణ అభివృద్ధిపై నిర్వహించిన (మిగతా 4వ పేజీలో)

భద్రాద్రిలో భక్తుల సందడి

- నిత్య కల్యాణంలో పాల్గొన్న 170 మంది భక్తులు
- మూడు రోజుల్లో రూ.33లక్షలకు పైగా ఆదాయం



భక్తులతో కిటకిటలాడుతున్న రామాలయం

భద్రాచలం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వరుస సెలవులతో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తుల సందడి పెరిగింది. ఆదివాంరం వేకువజాము నుంచే భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్నారు. అలాగే స్వామివారి ఆర్జితసేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు ముగింయడంతో ఆదివారం నిత్యకల్యాణాలను పునః ప్రారంభించారు. తొలిరోజు నిత్యకల్యాణంలో 170మంది, అభిషేకంలో 48మంది భక్తులు పాల్గొన్నారు. స్వర్ణ పుష్పార్చనలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భద్రాద్రి రామాలయానికి భక్తుల సంఖ్య పెరగడంతో మూడు రోజుల్లోనే దేవస్థానానికి రూ.33లక్షలకు పైగా ఆదాయం లభించింది. 11న రూ.12.79లక్షలు, 12న రూ.10.75లక్షలు రాగా ఆదివారం రూ.11లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం సాయంత్రం భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు.

రేపటి నుంచి ఏఐకేఎస్ జాతీయ మహాసభలు

- ఉమ్మడి జిల్లా నుంచి 15 మంది ప్రతినిధులు హాజరు
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర అధ్యక్షుడు బాగం

4

రుచి.. శుచి పెరిగింది

- పెంచిన మెస్ చార్జీలతో విద్యార్థులకు కడుపునిండా భోజనం
- అల్పాహారం నుంచి మాంసాహారం వరకు భేష్
- కార్పొరేట్‌కు మించి ఆహార నాణ్యతా ప్రమాణాలు
- జిల్లాలో 5,252 మంది విద్యార్థులకు సంక్షేమ భోజనాలు
- సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ



అల్పాహారానికి ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ అంటే కిచిడి, అల్పాహారం, పురుగుల అన్నం, నీళ్ల చారు, పలచటి మజ్జిగ.. ఇదంతా ఇప్పుడు గతం.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లకు మెస్ చార్జీలు పెంచటంతో కార్పొరేట్ విద్యా సంస్థలకు మించిన స్థాయిలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఖమ్మం సాంఘిక సంక్షేమ వసతిగృహాలు విద్యార్థుల మెనూను అమలు చేస్తున్నాయి. ఈ భోజనాలపై విద్యార్థుల నుంచి తల్లిదండ్రుల వరకు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సంక్షేమ వసతిగృహంలో 100 మంది విద్యార్థులకు గాను 125 నుంచి 130 మందికిపైగా విద్యార్థులు సంక్షేమం పొందుతున్నారంటే భోజనాల నిర్వహణ తీరును అర్థం చేసుకోవచ్చు.

ఏడేళ్ల తర్వాత పెరిగిన డైట్ చార్జీలు

రోజురోజుకు నిత్యవసరాలు, కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. దానికనుగుణంగా సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం డైట్ చార్జీలను పెంచాల్సి ఉంటుంది. కానీ 2011 తర్వాత 2017లో మాత్రమే డైట్ చార్జీలు పెంచారు. మళ్లీ 2024 నవంబరు 1నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచింది. చార్జీలతో పాటుగా ఆహారపు మెనూను సైతం పెంచారు. వారంలో ఐదు రోజులు కోడి గుడ్డు, ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు స్నాక్స్, ప్రతి గురువారం చికెన్ కొత్తగా పెంచారు. అల్పాహరంలో బొండా, ఉప్మా, ఇడ్లీ, పూరి, చపాతి సంక్షేమ వసతిగృహాలకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు ఆర్థిక ఇబ్బందులు తొలిగాయి.

జిల్లాలో 5,252 మంది విద్యార్థులకు భోజనం

కస్తాల సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ

జిల్లాలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 41 హాస్టల్స్, ఇంటర్ నుంచి పీజీ వరకు 11 కాలేజీ హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో 5,252 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. పెరిగిన చార్జీలతో (మిగతా 4వ పేజీలో)

కొనుగోలు కొర్రీలకు చెక్

- సేకరణ కేంద్రాల్లోనే మిషన్లతో ధాన్యం పరిశుభ్రం
- జిల్లాలో ఇప్పటివరకు 2,312 మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 'ధాన్యం బాగాలేదు.. మట్టి పెళ్లలు ఉన్నాయి.. బస్తాకు 12 కేజీలు తరుగు తీస్తున్నాం.. అలా అయితేనే ధాన్యం దిగుమతి చేసుకుంటాం' అంటూ మిల్లర్లు ఇప్పటి వరకు పలు కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేయగా అలాంటి ఇబ్బందులకు, మిల్లర్లు పెట్టే కొర్రీలకు అధికారులు చెక్ పెట్టారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని శుభ్రపరిచే యంత్రాలను ఈ సారి తీసుకొచ్చారు. ధాన్యంలో ఎలాంటి మట్టిపెళ్లలు, చెత్తా చెదారం లేకుండా మిషన్ల ద్వారా శుభ్రం చేస్తున్నారు. దీంతో ఆరబెట్టి పరిశుభ్రంగా ఉన్న ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాల్లో సేకరిస్తున్నారు. అంతే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు (మిగతా 4వ పేజీలో)



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

వర్గీకరణతో భావితరాలకు బంగారు భవిష్యత్తు

- 30ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కింది
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ముదిగొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ద్వారా భావి తరాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభిలో ఆదివారం ఆయన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మందక్రిష్ణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వల్ల రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలవుతోందన్నారు. 30ఏళ్ల పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఫలితం దక్కిందన్నారు. అణగారిన వర్గాల్లో చదువుకోవడానికి అవకాశాలు, ఉద్యోగాలు రావడం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనేనన్నారు. ఎస్సీ వర్గీకరణతో భావి తరాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎంఆర్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు గుండెపాక నర్సయ్య, దేవేంద్రప్రసాద్, ఏపూరి వెంకటేశ్వర్లు, ఇసన్నపల్లి అశోక్, కూరపాటి సునీల్, చూరగంటి అంజయ్య, వంగూరి ఆనందరావు, బచ్చలకూర వెంకటేశ్వర్లు, పగిడికత్తుల ఈదయ్య, నూకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి ఆరోగ్యం.. ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం..

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రతీ ఒక్క రికీ సంపూర్ణ ఆరోగ్యం కల్పించడమే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘు రాంరెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంలో ఇండియన్ మెడి కల్ అసోసియేషన్(ఐఎంఏ) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో వైద్యుల వృత్తినైపుణ్య అభివృద్ధి పెంపు కార్యక్ర మాన్ని (సీపీడీ) ఐఎంఏ భవన్‌లోని డా.వైఆర్కే ఆడిటోరి యంలో నిర్వహించారు.. ఖమ్మం ఐఎంఏ అధ్యక్షుడు డా.కం భంపాటి నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మానికి రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ ప్రతినిధులు తరలి వచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ ప్రజారో గ్యానికి ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఐఎంఏ ప్రతినిధుల సూచనల మేరకు ట్రేడ్ లైసెన్స్ కోర్టు పరిధిలో ఉందని కొంత వెసులుబాటు కల్పించే విషయంలో మంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిస్ మెంట్ యాక్ట్ ఇబ్బందికరంగా ఉందని ఐఎంఏ ప్రతినిధులు ఎంపీకి వివరించారు. ఈ విషయంలోనూ చర్చిస్తానని అన్నారు. హాస్పిటల్ రిజిస్ట్రేషన్‌కు సింగిల్ విండో విధానాన్ని అమలు చేసే విధానంపై చర్చిస్తానని ఎంపీ అన్నారు. డాక్ట ర్లపై దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని, హాస్పి టళ్లు ధ్వంసం చేస్తున్నారని ఐఎంఏ బాధ్యులు ఎంపీకి వివ రించారు. ఈ సందర్భంగా ఐఎంఏ బాధ్యులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై పరిష్కరించేందుకు కృషి చేస్తా నని ఎంపీ హామీ ఇచ్చారు.

● రాష్ట్ర భారీ నీటిపారుదల, ఇందిరమ్మ హౌజింగ్ సొసైటీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు మాట్లాడుతూ ప్రతీ



ప్రసంగిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

నియోజకవర్గానికి 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేసేందుకు ప్రజాప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గతంలోనే రైతుల సహకారంతో ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి తక్కువ ధరకు వైద్యం అందించేలా చేశామన్నారు. అనంతరం ఎంపీ రఘురాం రెడ్డి, మువ్వా విజయ్‌బాబుకు ఐఎంఏ వైద్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అశోక్, కోశాధికారి డాక్టర్ దయాళ్ సింగ్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్, మాజీ కార్యదర్శి డాక్టర్ విజయారావు, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బొలికొండ శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.జ గదీష్ బాబు, కోశాధికారి డాక్టర్ స్వప్న, ఆయూష్ హాస్పిటల్ (విజ యవాడ) చైర్మన్ డాక్టర్ గోపాలకృష్ణ, వైద్యులు సోమవేఖర్, పూర్ణ చందర్‌రావు, రఘురాం, ఖమ్మం ఐఎంఏ సీనియర్ వైద్యనిపుణులు కే గురునాథరావు, బాగం కిషన్‌రావు, వై.ప్రసాద్, ప్రముఖ కార్డి యాక్ వైద్య నిపుణులు ఎంఎఫ్ గోపీనాథ్, అళనే ప్రవీణ్‌కుమార్, పొన్నం సుబ్బారావు, హర్షతేజ, జీఆర్ శ్రీహర్ష, సీతారాం, ఖమ్మం వైద్యనిపుణులు కుసుమరాజు రవికుమార్, కూరపాటి ప్రదీప్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు..

- జీఎం విజిలెన్స్ ప్రసాదరావు

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామకాలు జరుగుతాయని అభ్యర్థులు ఎవరు దళా రులను ఆశ్రయించి నష్టపోవద్దని సింగ రేణి జనరల్ మేనేజరు (విజిలెన్స్) కే. ప్రసాదరావు, జనరల్ మేనేజర్ రిక్రుట్ మెంట్‌సెల్ బెనడిక్ట్ నికోలస్ కోరారు. ఆదివారం సింగరేణి మహిళా కళాశా లలో బయో కెమెస్ట్రీ, జమెదార్ ఇంట ర్నల్ పోస్టుల భర్తీకి రాత పరీక్షలను నిర్వహించారు. బయో కెమిస్ట్రీ ఒక్క పోస్టుకు 9 మంది అభ్యర్థులు హాజరు కాగా జమేదార్ 26 పోస్టుల భర్తీకి 77మంది అభ్యర్థులకు హాలు టికెట్లు జారీ చేయగా 70మంది అభ్యర్థులు రాత పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాన్ని పరిశీలిం చిన జీఎంలు మాట్లాడుతూ అభ్యర్థులు



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న జీఎంలు

ఎవరు దళారులను ఆశ్రయించవద్దని ప్రతిభ ఆధారం గానే నియామకాలు జరుగుతాయని తెలిపారు. రాత పరీక్షలు, విజిలెన్స్ సిబ్బంది, సీసీ కెమెరాల పర్యవేక్ష ణలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అదే రోజుపరీక్ష ఫలితాలను వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వేణుగోపాలరావు, సెక్యూరిటీ అధికారి వేణుమాదవ్, పర్సనల్ మేనేజర్ ప్రకాష్, నాగేశ్వరరావు, విజిలెన్స్ అధికారి రాంచందర్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చింత శారదలు హాజరయ్యారు.

బొగ్గు గనుల కార్మికుల పెన్షన్‌పై త్వరలో ఉన్నతస్థాయి సమావేశం

బీఎంఎస్ ఆధ్వర్యంలో కలిసిన నేతలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ

ఇల్లెందు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు గనుల కార్మికులకు చెల్లిస్తున్న అతి తక్కువ పెన్షన్లు సమీక్షించి ఇతర ప్రభుత్వ రంగ సంస్థల మాదిరిగా పెన్షన్లు చెల్లించడానికి త్వరలో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లో తన నివాసంలో కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ బీఎంఎస్ లైజ నింగ్ ఇన్‌చార్జి పులి రాజారెడ్డి ఆధ్వర్యంలో కోల్ మైన్స్ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి బొగ్గు గనుల కార్మికుల పెన్షన్ స్కీం గురించి సవిరంగా చర్చించి 63 పేజీల సమగ్ర నివేదినను సమర్పించారు. సీఎంపీ ఎఫ్ ద్వారా అమలు చేస్తున్న పెన్షన్లు పెంచడం కోసం చేపట్టాల్సిన అంశాలను, సీఎంపీఎఫ్ పని విధానం పైన కాగ్ రిపోర్టులో పేర్కొన్న ముఖ్య మైన తప్పిదాలను, గత కేంద్ర ప్రభుత్వం చేపట్ట లేకపోయిన అంశాలు, పెన్షన్ పెరుగుదలకు కేంద్రం తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై ప్రతినిధి బృంద నాయకుల కేంద్ర మంత్రికి ఒక సమగ్ర నివేదికను అందించారు. ఈ మేరకు మంత్రి కిష న్‌రెడ్డి త్వరలో బొగ్గు మంత్రిత్వ శాఖ సమావేశం ఏర్పాటు చేస్తానని అందులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమస్యలు ప్రత్యామ్నాయ మార్గాలను ఇవ్వాలని ప్రతినిధులను ఆయన కోరారు. ఓఎన్‌జీసీ, ఏఎన్‌సీఎల్ కంపెనీలు రిటైర్డు ఉద్యోగుల కోసం ప్రవేశ పెట్టిన ఫెలిస్టేషన్ స్కీం (నగదు చెల్లింపు) లాంటి పథకాన్ని లాభాల్లో నడుస్తున్న సింగరేణి కాలరీస్‌లో కూడా ప్రవేశ



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు

పెట్టేలా ఆదేశించాలని ప్రతినిధి బృందం మరో మెమోరాండం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సమర్పించింది స్పందించిన మంత్రి సింగరేణి కాలరీస్ కంపెనీ యాజమాన్యానికి లెటర్ రాస్తానని హామీ ఇచ్చినట్లు రిటైర్డు డైరెక్టర్లు తెలిపారు. బీఎంఎస్ జాతీయ నాయకులు పులి రాజిరెడ్డికి సానుకూలంగా స్పందించిన మంత్రి కిషన్ రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో రిటైర్డు డైరెక్టర్లు వాసుదేవరావు, జేవీ దత్తాత్రేయులు, రిటైర్డు జీఎం కేఆర్‌సీ రెడ్డి, రిటైర్డు డిప్యూటీ సూప రింటెండెంట్ మేడిపల్లి బాబూరావు, వేణు మాధవ్ సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

శతాధిక వృద్ధురాలికి ఘన సన్మానం

అభిమానాన్ని చాటుకున్న కుటుంబీకులు



లక్ష్మీనర్సమ్మను సన్మానించిన కుటుంబసభ్యులు

జూలూరుపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆమెకు వందేళ్లు అయి తేనేం. తన పనులను తానే చక్కగా చేసుకుంటుంది. ఆమె నాలుగు తరాల ప్రతినిధి. ఆదివారం ఘన సత్కారం అందుకుంది. జూలూరు పాడు మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన పొట్టా లక్ష్మీనర్సమ్మ ఇటీవలే వందేళ్ల జీవన ప్రయాణం పూర్తి చేసుకున్నారు. అరుదైన ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం పాపకొల్లు గ్రామంలో మన వళ్లు, మనవరాళ్లు ఆమెను ఘనంగా సన్మానించారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసు కుని నాలుగు తరాల తర్వాత కుటుంబీకులంతా ఇక్కడికి తరలివచ్చి నర్సమ్మకు పూలమాలలతో, శాలువాలు కప్పి సత్కరించి తమ అభిమా నాన్ని చాటుకున్నారు. అనంతరం ఆమెకు పాదాభివందనం చేశారు. ఇదిలా ఉండగా ఆమెకు 5గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్త లక్ష్మీనర్సయ్య 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు.

ఉమ్మడి కుటుంబమంతా ఒక చోట చేరి..

- మూడు తరాల వారసులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం

జూలూరుపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి కుటుంబాలు నానాటికి అంతరించిపోతున్నాయి. ఉరుకుల పరు గుల జీవితంలో ఉద్యోగం కోసం ఒకరు, బతుకుతెరువు కోసం ఇంకొకరు పిల్లల చదువు కోసం మరొకరు ఇలా.. కన్న తల్లి దండ్రుల రక్త సంబంధాలను, పల్లెలను వదిలి పట్టణాలకు పరుగులు తీస్తు న్నారు. బంధాలు, బంధుత్వాలు, ప్రేమా నురాగాలు, అప్యాయతలు, ఆత్మీయులకు దూరంగా యాంత్రిక జీవితంలో పడి ఎవరికి వారే కాలంతో పాటు పరుగులు పెడుతున్నారు. శుభకార్యాలకు, చుట్టపు చూపుగా వచ్చి వెళ్లటమే తప్ప అంతా కలిసి యోగక్షేమాలను, బంధుత్వ మాధు ర్యాన్ని పంచుకునే సమయమే లేకుండా పోతోంది. ఈ క్రమంలో మండలంలోని



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

కాకర్ల గ్రామానికి చెందిన కీర్తిశేషులు డిల్లీ పుల్లయ్య-వెంకమ్మ గారి వంశస్తులు డిల్లీ గోపయ్య-కృష్ణవేణి, డిల్లీ రామయ్య-పద్మావతి, డిల్లీ వెంకటేశ్వర్లు-సీతమ్మ దంపతులకు చెందిన మూడు తరాల వారంతా ఆదివారం కాకర్ల గ్రామంలోని మామిడి వనంలో డిల్లీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ సుమారు 100 మంది కుటుంబ సభ్యులంతా ఒక చోట చేరి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఆటపాటలతో వనంలో సందడి చేశారు. ఆత్మీయ పలకరింపులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గత కాలం నాటి జ్ఞాపకాలు మధురస్మృతులను నెమరువేసుకున్నారు. ప్రత్యేక పూజలను నిర్వహిం చారు. పెద్దలకు సన్మానాలు చేసి, తల్లిదండ్రులకు పాదాభివందనాలు చేశారు.

వనజీవి.. ధన్యజీవి

(3వ పేజీ తరువాయి)

చేపట్టిన కార్యక్రమాలు యావత్తు దేశ ప్రజలు గౌరవించేలా చేశా యన్నారు. పచ్చదనాన్ని పెంచడానికి ఆర్థిక పరిస్థితులు సహకరించ కపోయినా ఒక పూట తిన్నా, తినకపోయినా మొక్కలతో వచ్చే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ వారి గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల అటవీ భూములు, ప్రభుత్వ భూములను పచ్చదనం చేశారన్నారు. వన చిరకాల కోరికలను నెరవేర్చేందుకు సాధ్యాసాధ్యా లను పరిశీలించి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నెరవేర్చడానికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీ ల్‌దత్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, తహసీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ శ్రీనివా సరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు వెంటపల్లి నివాళి



వనజీవి రామయ్యకు తన కార్టూన్‌తో నివాళులర్పించిన వెంటపల్లి సత్యనారాయణ

వైరా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వనజీవి రామయ్య మృతికి ఖజా నాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ తన కార్టూన్ ద్వారా శ్రద్ధాంజలి ఘటించారు. 2017లో వన జీవి రామయ్యకు పద్మశ్రీ అవార్డు లభించిన సమయంలో వెంటపల్లి తన కార్టూన్ ద్వారా రామయ్యకు అభినందనలు తెలిపారు. ఇప్పుడు రామయ్య మరణంతో చెట్లు కన్నీటి పర్యంతమైన రీతిలో కార్టూన్ వేసి వెంట పల్లి నివాళులర్పించారు.

రుచి.. శుచి పెరిగింది

(3వ పేజీ తరువాయి)

నూతన మెనూ అమలు చేస్తున్నాం, నెలలో ఎనిమిది సార్లు చికె న్, చికెన్‌లేని రోజుల్లో కోడిగుడ్డు ఇస్తున్నాం. అల్పాహారంలో బొండా, ఇడ్లీ, బగారా రైస్, పులిహోర, సాయంత్రం 5గంటలకు స్నాక్స్ ఇస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అంది స్తున్నాం.

పెరిగిన మెస్ చార్జీలు ఇలా...

3నుంచి 7వ తరగతి వరకు గతంలో రూ.950 ఉండగా పెంపులతో రూ.1330కు, 8నుంచి10వ తరగతికి గతంలో రూ.1,100, పెంపుతో రూ.1,540లకు, ఇంటర్ నుంచి పీజీ వరకు గతంలో రూ.1,500 ఉండగా ప్రస్తుతం రూ.2,100కు పెంచారు.

ఉదయం ఎండ.. రాత్రి రండా

(3వ పేజీ తరువాయి)

సమీపంలో పిడుగుపడగా.. అంగన్‌వాడి కేంద్రంలో సామగ్రి కాలిపోయింది. పక్కనే ఉన్న షామియానా కూడా కాలిపోయింది. పెనుబల్లి మండలం టేకులపల్లి ప్రాంతంలో ప్రధాన రహదారిపై చెట్టు పడిపోవడంతో గంటకుపైగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కల్లూరులో ఈదురుగాలు లతో వడగండ్ల వాన కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబె ట్టిన ధాన్యంతో పాటుగా, గాలికి పట్టాలు లేచిపోవడంతో మిగిలిన ధాన్యం తడిచిపోయింది. కల్లూరు పట్టణంలోని పుల్లయ్యబంజర వీధిలో ఓ ఇంటిపై రేకులు ఎగిరిపో యాయి. కల్లూరు నుంచి లింగాల మధ్య విద్యుత్ స్తంభం విరిగిపడటంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరగడంతో పలు గ్రామాలకు విద్యుత్ సర ఫరా నిలిచిపోయింది. కొణిజర్ల మండల కేంద్రంతోపాటు పెద్దగోపతి, తల్లాడ ప్రాంతాల్లో స్వల్ప వర్షపాతం నమో దైంది. అయితే జిల్లాలో పగటివేళ మాత్రం ఖమ్మం అర్బన్ పరిధిలోని ఖానాపురం పీఎస్ పరిధిలో 42.1, కారేపల్లి, వైరా, ముదిగొండ మండలం పమ్మి, కామేపల్లి లింగాలలో 41.9 డిగ్రీలు, నేలకొండపల్లి, పెనుబల్లిలో 41.8, చింతకా ని41.7తోపాటు పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్ర తలు నమోదయ్యాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో ఉరు ములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కొత్తగూడెం, పాల్వంచ, కరకగూడెం, సుజాతనగర్, చుంచుపల్లి, ములక లపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లిలో గాలివాన కురిసింది. చుంచుపల్లి మండలం పెనగడప కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిచిపోయింది. రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ఉరుకులు, పరుగులు పెట్టారు. పలు గ్రామాల్లోని తోటల్లో మామిడి కాయలు నేల రాలిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంత రాయం ఏర్పడింది. కొత్తగూడెం పట్టణంలో అండర్‌బ్రిడ్జి వద్ద వాననీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పిడుగుపాటు... తప్పిన పెను ప్రమాదం

దుమ్ముగూడెం మండలంలో ఆదివారం సాయంత్రం వీచినగాలిదుమారం కొంతసేపు బీభత్సాన్ని సృష్టించింది. కాటాయిగూడెంలో జనావాసాల మధ్య ఆదివారం పిడుగు పడింది. కల్లూరి పిడగయ్య, కోడి రాంబాబుల ఇంటి సమీ పంలో పిడుగుపాటుకు తాటిచెట్టు కాలిపోయింది. పిడుగు పడిన ప్రదేశానికి అతి సమీపాన ఇళ్లు,పాకల్లో పశువులుం డగా ఎటువంటి నష్టం కలగలేదు. శ్రీనగర్ కాలనీలో రేకులు లేచిపోయి ఇల్లు కూలిపోగా జీలకర్ర రమేష్ తలకు తీవ్రగాయమైంది. అతని కొడుకు భరత్‌సింహా స్వల్ప గాయాలపాలయ్యాడు. కాగా గాలిదుమారానికి పలుచోట్ల



దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెంలో పిడుగుపాటుకు దగ్ధమైన తాటిచెట్టు

విద్యుత్ లైన్లపై చెట్లు పడడంతోపాటు స్తంభాలు నేలకొరి గాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తింది.

వేసవిలోగా కాల్వల ఆధునీకరణ చేపట్టాలి

(3వ పేజీ తరువాయి)

ఎక్కడా రాజీపడకుండా పనిచేయాల న్నారు. విధి నిర్వాహణలో అలసత్వం లేకుండా సమన్వయంతో పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలన్నారు. ప్రణా ళికబద్ధంగా ప్రభుత్వం సాగునీటిని విడుదల చేస్తోందని, దానికి తగ్గట్టుగా అధికారయం త్రాంగం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి రైతు ప్రయోజనమే లక్ష్యంగా ముందుకె ళ్లాలన్నారు. రాష్ట్రం దేశానికే తలమానికంగా నిలుస్తోందన్నారు. పంట ఉత్పత్తులలో ధాన్యాగారంగా నిలుస్తుందన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతల ఇంట సిరులు కురి పించేలా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి బాటలు వేస్తోందన్నారు. తెలంగాణను సస్య శ్యామలంగా నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని, బీడు భూములు లేని తెలంగాణగా రాష్ట్రాన్ని మార్చేందుకు అనునిత్యం శ్రమిస్తున్నట్లు ఆయన తెలిపారు. విత్తనాలు, ఎరువులు సకా లంలో అందించేందుకు ప్రణాళికతో ముందు కెళ్తున్నామన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగు ణంగా ప్రతీ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.

రేపటి నుంచి ఏఐకేఎస్ జాతీయ మహాసభలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాలపై ఈనెల 15 నుంచి 17వరకు మూడు రోజులు పాటు తమిళనాడులోని నాగపట్నంలో ఏఐకే ఎస్ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కోతలు విధించారని, మోదీ ప్రభుత్వం రోజు రోజుకు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రైతు పోరా టాలతో మూడు నల్ల చట్టాల రద్దు జరిగినా బీజేపీ సర్కార్ పరోక్షంగా వాటిని అమలు చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ మహాసభలకు తెలంగాణ రాష్ట్రం నుంచి 50మంది ప్రతినిధులు హాజరవుతారని, వారిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 15మంది ప్రతినిధులు ఉంటారని ప్రకటిం చారు. వారిలో కొండపర్తి గోవిందరావు, మేడ కంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, ఏపూరి రవీంద్రబాబు, బానోత్ రాంకోటి, పుచ్చకా యల శ్రీను, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మంద డపు రాణి, ఎడ్లపల్లి శంకరయ్య, భాగం ప్రసాద్, ఏలూరి భాస్కర్‌రావు, ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీనివాస్, కల్లూరి వెంక టేశ్వర్లు, కుమారి, హనుమంతరావు, లక్ష్మీ పాల్గొంటారని తెలిపారు.

బీటీపీఎస్ యూనిట్-1లో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

మణుగూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాంతంలో ఉన్న బీటీపీఎస్ భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ యూనిట్-1లో ఆదివారం సాయంత్రం విద్యుత్ ఉత్పత్తిని జెన్కో ఇంజనీర్లు పునరుద్ధరించారు. గత ఏడాది జూన్ 28న బీటీపీఎస్ ప్లాంట్‌లోని యూనిట్-1లోని ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపాల కారణంగా దగ్ధమైంది. ఈ ఘటనలో జెన్కోకు సుమారు రూ.30కోట్లనష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. దీంతో 270మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపో యింది. అనంతరం అధికారులు కాలిపోయిన ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మ తుల కోసం చెన్నైకు తరలించారు. తొమ్మిది నెలల అనంతరం మరమ్మ తులు పూర్తికాగా గత నెలలో తిరిగి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రత్యేకవాహనంలో బీటీపీఎస్‌కు తీసుకువచ్చారు. నెలరోజుల పాటు మణుగూరు బీటీపీఎస్ ఇంజనీర్లు కష్టపడి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి విద్యుత్ ఉత్పత్తిని పున రుద్ధరించారు. యూనిట్-1లో విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభం కావడంతో ఇంజనీర్ల బృందానికి సీఈ అభినందనలు తెలిపారు.

కొనుగోలు కొర్రీలకు చెక్

(5వ పేజీ తరువాయి)

రవాణా చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ శని, ఆదివారాల్లో జిల్లాలోని పలు ధాన్యం కొను గోలు కేంద్రాలను పరిశీలించారు. అక్కడిక్కడే ధాన్యం పరిశుభ్రత చేసే మిషన్ల పనితీరును పరిశీలించారు. జిల్లాలో ఇప్పటి వరకు 21కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. మొత్తం 344కొనుగోలు కేంద్రా లకు గాను 212ఇప్పటి వరకు ప్రారంభించారు. వీటిలో 21కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ఆదివారం వరకు జిల్లాలో 2312.720 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. 254మంది రైతుల నుంచి వీటిని సేకరించారు. సేకరిం చిన ధాన్యాన్ని కూడా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎప్పటికప్పుడు మిల్ల ర్లకు తరలిస్తున్నారు. జిల్లాలో రూ.1.75 కోట్లకు ధాన్యాన్ని సేకరించగా ఇప్పటి వరకు 25లక్షలను రైతులకు చెల్లించారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్త కుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని చర్యలు చేపట్టామని డీఎస్వో చందన్‌కుమా ర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

అభివృద్ధిలో మధిరను ఆదర్శంగా నిలుపుతా

(5వ పేజీ తరువాయి)

సమావేశంలో భట్టి మాట్లాడుతూ మధిర పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కునేం దుకు జాలిముడి ప్రాజెక్ట్ నుంచి నీళ్ల తీసుకోవాలని అవసరమైతే మోటార్లు, పైప్‌లైన్ వేసుకోవాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మొదటి అంతస్తును ఇతర అవసరాలకు వాడుకోవాల న్నారు. ట్యాంక్‌బండ్ అభివృద్ధిపై పకడ్బందీ ప్రణాళికలు తయారు చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల యాక్షన్ ప్లాన్, టూరిజం, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి అధికారులు తగు ప్రణాళికలు రూపొందించి ఈనెల 16న హైదరాబాద్ రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ శ్రీనివాసరావు, ఈ.ఈ భాస్కర్‌రెడ్డి, మునిసిపల్ డి.ఈ నరేష్‌రెడ్డి పలు రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రియురాలి భర్త హత్యకు సుఫారీ

ఖమ్మం, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): ప్రియురాలి భర్తను చంపేందుకు సుపారీ ఇచ్చి పూర్తిస్థాయిలో డబ్బులు ఇవ్వకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ముదిగొండ మండలం సువర్ణపురం గ్రామానికి చెందిన తోట ధర్మ అనే వ్యక్తి భార్యతో అదే గ్రామానికి చెందిన కొండూరి రామాంజనే యులుకు మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం భర్త ధర్మకు తెలియడంతో గొడవలు జరుగుతున్నాయి. ప్రియురాలి భర్తను అడ్డుతొలగించుకోవాలని రామాంజనేయులు హత్య చేయించేం దుకు ప్రణాళిక రచించాడు. ఖమ్మం రూరల్ మండలం బారుగూడేనికి చెందిన దంతాల వెంకటనారా యణ, రౌడీ షీటర్ పగాడాల విజయ్‌కుమార్ అలియాస్ చంటికి ధర్మను హత్య చేసేందుకు రూ.20 లక్షలు సుపారీగా ఒప్పుకున్నాడు.. అడ్వాన్స్‌గా రూ.5లక్షలు ఇచ్చాడు. మార్చి 12న పథకం ప్రకారం ధర్మను కిడ్నాప్ చేసిన నిందితులు.. ఒప్పందం ప్రకారం మిగతా డబ్బులు ఇవ్వాలని రామాంజనే యులును అడిగారు. ఆయన స్పందించకపోవడంతో నిందితులు అప్పటికే కిడ్నాప్ చేసిన ధర్మాను బెదిరించి ఫోన్ పే ద్వారా రూ.1.50లక్షల నగదు, బంగారు గొలుసు తీసుకొని ఖమ్మం అర్బన్ పరిధిలో వదిలి వెళ్లిపోయారు. కాగా బాధితుడు ధర్మ తనకు ప్రాణహాని ఉందంటూ శుక్రవారం ఫిర్యాదు ఇవ్వ డంతో కేసు నమోదు చేసిన ఖమ్మం అర్బన్ పోలీసులు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి పర్యవేక్ష ణలో విచారణ జరిపి అసలు విషయం తేల్చారు. అయితే జరిగిన ఘటనపై ఆదివారం ఖమ్మం నగ రంలోని చెరుకూరి మామిడితోటలో నిందితులు సమావేశమైనట్లు విశ్వసనీయవర్గాల సమాచారంతో నిందితులుగా ఉన్న ముదిగొండ మండలం సువర్ణాపురానికి చెందిన కొండూరి రామాంజనేయులు అలియాస్ రాము, ఖమ్మం రూరల్ మండలం బారుగూడెంకు చెందిన దంతాల వెంకటనారాయణ అలియాస్ వెంకట్, ఖమ్మం నగరపరిధిలోని అగ్రహారానికి చెందిన పగడాల విజయ్‌కుమార్, వేముల కృష్ణ, పువ్వాడ అజయ్‌నగర్ కాలనీకి చెందిన బుర్రి విజయ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి నట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. నిందితుల నుంచి రెండు కత్తులు, ఎయిర్‌గన్, రూ.90వేల నగదు, సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



నగరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు డబ్బు దాహం ఎక్కువే. ఒక్కో కేంద్రం ఏర్పాటు ఎక్కువలో ఎక్కువ రూ. 4 వేల వరకు ఖర్చు చేయవచ్చని ప్రజలు చెబుతున్నారు. అయితే నగరపాలక సంస్థ అధికారులు మాత్రం ఆ అంచనాలను అమాంతం పెంచేశారు. తడకలు, గ్రీన్ మ్యాట్, నాలుగు కుండలకు ఏకంగా రూ.18,750గా లెక్క గట్టారు. అక్కడితో ఆగకుండా నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు.

ఈ చలివేంద్రాలకు దాహమెక్కువ !

- రూ. 4వేలు కూడా దాటని సామగ్రికి నాలుగురెట్ల అధిక ఖర్చు
- ఒక్కో కేంద్రానికి రూ.18,750తో నామినేటెడ్ పనులు
- నగరంలో రూ.14 లక్షలతో 75చలివేంద్రాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 60 డివిజన్లలోని ప్రధాన సెంటర్లలో 75 చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. చలివేంద్రాల ఏర్పాటును నామినేటెడ్ విధానంలో చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఒక్కో చలివేంద్రంలో నాలుగు మట్టి కుండలు, వాటికి మూతలు, నాలుగు ప్లాస్టిక్ గ్లాస్‌లు, చలివేంద్రం ఏర్పాటుకు చిన్న పాటి గుడిసె, ఒక ఫ్లెక్సీ ఏర్పాటుకు కేఎంసీ అధికారులు నిర్ణయించారు. వీటన్నింటికి బహిరంగ మార్కెట్‌లో రూ.4వేల వరకు వ్యయం జరిగే అవకాశం ఉంది. కానీ కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఏకంగా ఒక్కో చలివేంద్రానికి రూ.18,750 లెక్కలు పెట్టారు. సుమారు రూ.14 లక్షల ప్రజల పన్నుల ద్వారా చెల్లించిన కేఎంసీ నిధులకు బిల్లులు పెట్టారు.

చలివేంద్రాల్లో ఏర్పాటు చేసిన కుండల్లో 50శాతం వరకు నీరు(ఓటీ కుండలు)ఆగలేని కుండలు ఉన్నాయని విమర్శలు వెలువడుతున్నాయి. కొన్ని చలివేంద్రంలోని మట్టి కుండల్లో గత వారం రోజులుగా చుక్కనీరు పోయలేదు. చలి వేంద్రాల్లో కుండలు ఖాళీగా ఉండటంతో కొంతమంది నిరుపేదలు వాటిని ఇళ్లకు తీసుకెళుతున్నారు. ప్రధాన సెంటర్ల వద్ద ఆకర్షణీయంగా ఉన్న చలివేంద్రాల వద్దకు వెళ్లి మూత తీసిన ప్రజలు వాటిలో నీరు లేక పోవటంతో నెవ్వరపోతున్నారు. నిజాంపేట ప్రాంతంలో కేఎంసీ



ఆర్టీవో కార్యాలయం పక్కన కుండలు లేని చలివేంద్రం

ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో సీపీఐ నాయకులు మంచినీరు పోయటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఏఈలే చూసుకుంటున్నారు: కృష్ణలాల్, ఈఈ, కేఎంసీ

ఖమ్మం నగరంలోని ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేశాం. వాటి నిర్మాణం నుంచి నిర్వాహణ వరకు ఏఈలే చూసుకుంటున్నారు. మూడు ప్రాంతాలుగా విభజన చేసి ముగ్గురు ఏఈ అధికారులకు కేటాయించాం. కాంట్రాక్టర్‌ను వాళ్లే మాట్లాడారు. నాకు ఎటువంటి సమాచారం లేదు. నిర్వాహణపై పరిశీలన చేస్తాం..


నివాళులర్పిస్తున్న డీఎఫ్‌వో సిద్దార్థ విక్రమ్‌సింగ్


సీపీ సునీల్ దత్, ఎంపీ రఘురాం రెడ్డి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి


నివాళులర్పిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

వనజీవి రామయ్యకు ఆపేరు ఎలా వచ్చిందంటే..



ఖమ్మంరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం, రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ దరిపల్లి రామయ్యకు వనజీవి అనే పేరు ఎలా వచ్చిందనేది చర్చజరుగుతోంది. అయితే ఆ వనజీవి అనే పేరు 'ఆంధ్రజ్యోతి' పత్రికతోనే వచ్చింది. ఈ విషయాన్ని రామయ్య స్వయంగా ఆంధ్రజ్యోతి, వివిధ పత్రికల విలేకరులతో చెప్పిన సందర్భాలు ఉన్నాయి. దరిపల్లి రామయ్య చిన్న నాటినుంచి మొక్కలు నాటడం, విత్తనాలు ఏరడం వాటిని ఊరూరా తిరిగి రోడ్లవెంట చల్లుతున్న విషయం తెలుసుకున్న ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్న ఓ విలేకరి దరిపల్లి రామయ్యను ఇంటర్వ్యూ చేశారు. మరుసటి రోజు ఆయన ఇంటిపేరు దరిపల్లి రామయ్య అయితే (వనజీవి రామయ్య) అని సుమారు 23 ఏళ్ల క్రితం కథనం ప్రచురితమైంది. ఆనాటి నుంచి రామయ్య ఇంటి పేరు వనజీవి రామయ్యగా మారింది. ఈ విషయాన్ని పద్మశ్రీ అవార్డు అందుకున్న సమయంలో ఓ ఇంటర్వ్యూలో రామయ్య స్వయంగా తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఘన నివాళి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఫలితాన్ని ఆశించకుండా కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతినిత్యం పరితపిస్తున్న సామాజికవేత్త సురేష్ గుప్తా పద్మశ్రీ వనజీవి రామయ్య అంత్యక్రియలకు ఆవుపేడ, వివిధ రకాల చెట్ల గింజలు తీసుకువచ్చి హాజరై నివాళులర్పించారు. నల్లగొండ పట్టణానికి చెందిన మిట్టపల్లి సురేష్ గుప్తా గుండెపోటుతో మరణించిన వనజీవి రామయ్య మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సురేష్ గుప్తా గత అయిదేళ్ల నుంచి కాళ్లకు చెప్పులు లేకుండా సాధారణ దుస్తులు బనియన్, దోవతీ ధరించి ప్లాస్టిక్ వాడకంతో జరిగే నష్టాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకు కంకణం కట్టుకున్నాడు. శ్మశాన వాటికలో రామయ్య అంత్యక్రియల కోసం వాడిన ప్లాస్టిక్ వ్యర్థాలను మండుటెండను సైతం లెక్కచేయకుండా తానే స్వయంగా ఏరాడు. దీంతో రామయ్య అంత్యక్రియలకు వచ్చిన వారంతా సురేష్ గుప్తాసేవాగుణాన్ని కొనియాడారు.


సురేష్ గుప్తా

పల్లెగూడెం శ్మశాన వాటికలో రామయ్య అంత్యక్రియలు


వనజీవి పాడె మోస్తున్న తహసీల్దార్, కమిషనర్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ వనజీవి రామయ్య(79) శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఆయన మృతి విషయం తెలుసుకున్న రూరల్ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఏదులాపురం కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి వెంటనే రామయ్య ఇంటికి చేరుకున్నారు. రెండురోజులపాటు అక్కడ పనులన్నీ స్వయంగా వారిద్దరే దగ్గరుండి చూసుకున్నారు. రామయ్య మృదేహన్ని చూసేందుకు వచ్చిన ప్రజలకు, అభిమానులకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్, కమిషనర్ కలెక్టర్ అనుమతి తీసుకుని పల్లెగూడెం శ్మశానవాటికలో రామయ్యను ఖననం చేశారు. రామయ్య పాడెను సైతం వారిద్దరే మోయడంతో రామయ్య అభిమానులు,ప్రజాప్రతినిదులు వారిద్దరు అధికారులను అభినందించారు.


మంత్రి తుమ్మలను సత్కరిస్తున్న ఆంధ్రా పామాయిల్ రైతులు

ఆంధ్ర పామాయిల్ గెలలకు... అశ్వారావుపేటలో గానుగ..

- రెండు రాష్ట్రాల ఉత్పత్తుల ఆయిల్ రికవరీలో స్వల్ప తేడా

అశ్వారావుపేట, దమ్మపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన పామాయిల్ ఫ్రూట్‌ను తెలంగాణాలోని అశ్వారావుపేటలో ట్రియల్ రన్‌గా ఫ్రూట్‌ను క్రషింగ్ చేసేందుకు సహకారం అందించిన వ్యవసాయశా శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అప్పారావుపేటలోని వ్యవసాయక్షేత్రంలో ఆదివారం ఏపీ పామాయిల్ రైతులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. కొంతకాలంగా ఆంధ్రరాష్ట్రంలోని ఆయిల్‌ఫెడ్‌లో పామాయిల్ ఫ్రూట్ రికవరిలో 17శాతం కంటే తక్కువగా వస్తుండటంతో అక్కడి ప్రైవేటు ప్యాక్టరీలు తెలంగాణా ధర చెల్లించేందుకు నిరాకరించాయి. ఈవిషయాన్ని అక్కడి ప్రభుత్వానికి తెలియ చేయటంతో పామాయిల్ రికవరీని నిర్ధారించేందుకు అక్కడి ప్రభుత్వం తెలంగాణా ప్రభుత్వానికి లేక రాసింది. మంత్రి తుమ్మల చొరవతో నాలుగురోజుల క్రితం ఏపీకి చెందిన 800టన్నుల పామాయిల్ ఫ్రూట్‌ను ఆంధ్రరాష్ట్ర ఆయిల్‌ఫెడ్ అధికారుల ఆధ్వర్యంలో గనుగ చేయగా తెలంగాణా పామాయిల్‌కు ఆంధ్రాపామాయిల్ ఫ్రూట్‌కు రికవరీలో స్వల్ప తగ్గుదల ఉన్నట్లు గుర్తించారు. తెలంగాణా 19.46శాతం వస్తుండగా ఆంధ్రాఫ్రూట్ క్రషింగ్ చేయగా 19.36శాతం రికవరీశాతం నమోదు అయింది. ఆంధ్రా ఫ్రూట్ రికవరీలో అతి దగ్గరగా రావటంతో ఈవిషయం తెలుసుకున్న రైతులు సంతోషం వ్యక్తం చేశారను. దీంతో ఆంధ్రరాష్ట్రంలోని ఐదు జోన్లకు చెందిన పామాయిల్ రైతులు ఆంధ్రరాష్ట్రం పామాయిల్ సంఘంరాష్ట్ర అధ్యక్షుడు బొప్పన రాఘవరావు మురళి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా పామాయిల్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు, బండి బాస్కర్, దొడ్డా ప్రసాదు, కాసాని నాగప్రసాదు, ఎర్రావసంతరావు, కాసాని మంగేశ్వరరావు ఉన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నేలకొండపల్లి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): 365ఏ జాతీయ రహదారిపై బోదులబండ రోడ్డు సమీపంలో ఆదివారం తెల్లవారుఝామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొనటంతో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ధాన్యం లోడుతో కోదాడ వైపు వెళుతున్న ట్రాక్టర్‌కు పంక్చర్ గావటంతో, ట్రాక్టర్‌కు పంక్చర్ వేస్తున్న సమయంలోకోదాడ వైపుకే వెళుతున్న ద్విచక్రవాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందగా,ట్రాక్టర్‌కు పంక్చర్ వేస్తున్న బాణోతు గణేష్ అనే వ్యక్తికి కుడి చేయి విరిగింది.

అనారోగ్యంతో గొత్తికోయ బాలుడి మృతి

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో గొత్తికోయ తెగకు చెందిన రెండేళ్ల బాలుడు ఆదివారం మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెన్నాపురం కాలనీలో నివాసం ఉండే యామ్లా బంటి రెండేళ్ల కుమారుడు బాలు (2) ఏడాది కాలంగా ఉదరం పెరిగిపోయి ఒక రకమైన వ్యాధితో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలోనే బాలుడు ఒక్కసారిగా నాలుగు సార్లు వాంతులు చేసుకోవటంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. బాలుడి మృతితో గొత్తికోయ ఆవాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


మమత (ఫైల్)

బూర్గంపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామానికి చెందిన మిర్యాల మమత(28) రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రెండు రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మమతకు తొమ్మిదేళ్ల క్రితం నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన మిర్యాల అశోక్‌తో వివాహం జరిగింది. వీరికి ఓ పాప ఉంది. గత కొన్ని నెలలుగా దుర్గాప్రసాద్ అనే యువకుడు మమతను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో గొడవలు కూడా జరిగాయి. దుర్గాప్రసాద్ వేధింపులు, బెదిరింపులు ఎక్కువ కావడంతో ఆమె మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆదివారం మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు పూరిళ్లు దగ్ధం

- ఈదురు గాలులతో ఒక్కసారిగా అలుముకున్న మంటలు
- రూ.12 లక్షల మేర ఆస్తినష్టం.. కట్టుబట్టలతో మిగిలిన గిరిజనులు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని దురదపాడు పంచాయతీలోని పాలగుంపులో ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతంతో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఓవైపు ఈదురు గాలులు మరో వైపు బలమైన మంటలు అరగంటలోనే మూడు నివాసాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ప్రమాదం వలన దాదాపు రూ.13లక్షల వరకు నష్టం వాటిల్లునట్లుగా సమాచారం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పాలగుంపులో నల్లవెల్లి స్వప్న ఇంటిలో సాయంత్రం ఐదున్నర ప్రాంతంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన మంటలు చెలరేగాయి. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేరు. అందరూ కూలిపనులకు వెళ్లారు. అదే సమయంలో ఈదురు గాలులు వీయటంతో ఇంటికి అటువైపు ఇటువైపున ఉన్న మడకం రాజు, కొర్సా భద్రమ్మ ఇంటికి కూడా మంటలు అలుముకున్నాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో ఇళ్లలో ఉన్న వస్తువులకు కూడా బయటకు తీసుకువచ్చే అవకాశం లేదు. ఊరంతా అక్కడికి వచ్చినా మంటలు బలంగా ఉండటంతో ఆర్పటం సాధ్యం కాలేదు. దాదాపు అరగంటలోనే మూడు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. దీంతో గిరిజనులకు కట్టబట్టలే మిగిలాయి. ప్రమాదంలో మడకం రాజు ఇంట్లో ఉన్న దాదాపు రూ.3.80లక్షల విలువైన బంగారం, ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన రూ.5లక్షల నగదు, ఇంట్లో సామాగ్రి, పిల్లల సర్టిఫికెట్స్ ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఇంటి బయట ఉన్న ఆటోను మాత్రం బయటకు తీసుకువచ్చారు. నల్లవెల్లి స్వప్న ఇంట్లో ఉన్న క్వింటన్నర జీడిగింజలు, రూ.5వేల నగదు, బంగారు గొలుసు, మంచాలు, బీరువా ఇలా అన్ని రకాల సామాగ్రి కాలిపోయింది. కొర్సా భద్రమ్మ నివాసంలోనూ అన్ని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.12లక్షల వరకు నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు రాజు, స్వప్న వేడుకున్నారు.


పాలపాంగు గ్రామంలో దగ్ధమవుతున్న పూరి గుడిసెలు


కిందపడిన బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సుధాకర్ రెడ్డికి స్వల్ప గాయాలు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా నగరంలోని జడ్పీసెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద చీపురుతో ఊడుస్తూ ప్రమాదవశాత్తు బీజేపీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి కిందపడ్డాడు. విగ్రహం చుట్టూ పేపర్లు, చెత్త ఉండటంతో వాటిని శుభ్రంచేసేందుకు సుధాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు చీపురుతో ఊడుస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ తడిగా ఉండటంతో ఇద్దరూ జారీ కిందపడ్డారు. వెంటనే అక్కడే ఉన్న బీజేపీ కార్యకర్తలు నాయకులు వెంటనే పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరరావును లేపారు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

వైరా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వైరా మండల పరిధిలోని జాతీయ ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. వైరాలో ఎస్‌బీఐ పట్టణ బ్రాంచ్‌కు ఎదురుగా డివైడర్‌ను దాటుతున్న మన్నే వరప్రసాద్‌ను ఖమ్మం నుంచి తల్లాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వరప్రసాద్ కాలు విరిగిపోయింది. అలాగే మరికొన్ని గాయాలయ్యాయి. స్టేజీ పినపాక గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విప్పలమడక గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు.

లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలి

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- వైరాలో కదంతొక్కిన కార్మికులు



అభివాదం చేస్తున్న టీయూసీఐ నేతలు

వైరా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్మికవర్గ పోరాటాలకు టీయూసీఐ నాయకత్వం వహిస్తుందని ప్రకటిస్తుందని ప్రకటించారు. టీయూసీఐ ప్రథమ బహుమతి ఆడేపు రామారావునగర్ అయిన వైరాలోని కామిశెట్టి కల్యాణమండపంలో ఆదివారం జరిగింది. మహాసభకు ముందు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వందలాదిమంది కార్మికులతో వైరాలో ప్రదర్శన నిర్వహించారు. కల్యాణ మండపం నుంచి క్రాస్‌రోడ్డు, కొత్త బస్టాండ్, మునిసిపాలిటీ, పాత బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. కార్మికులు ఎర్రజెండాలు చేబూని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరుణోదయ సాంస్కృతిక కళాకారులు డప్పు డ్యాన్స్ ప్రదర్శించి అలరించారు. ఈ మహాసభలో సూర్యం మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో పేదలను ఉద్ధరిస్తామని పాలకులు ప్రకటించి 75సంవత్సరాలైనా ఇంతవరకు పేదరికం పోలేదని పాలకులే అంగీకరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చే ఉచితాలు, పించన్ల వలన వారి పట్ల పాలకులకు లెక్కలేనితనం ఏర్పడిందని విమర్శించారు. పాలకుల మోసపూరిత ప్రకటనలను కార్మికులు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో కార్మిక అమరవీరులకు రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎల్ఎస్. పద్మ, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.మోహన్‌రావు, పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షురాలు డి.శిరీష పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ బాటే

- టీజేఈజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి



టీజేఏసీ నేతల సంఘీభావం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ బాట తప్పదని టీజే ఈ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి ఖమ్మం టీఎన్జీవో కార్యాలయంలో ఖమ్మం జిల్లా తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్‌కమిటీ (టీజేఈ జేఏసీ) కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా 5డీఏలు పెండింగ్‌లో లేవని మన రాష్ట్ర చరిత్రలో కూడా ఇప్పటివరకు ఐదు డీఏలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ డీఏ లు విడుదల చేయాలన్నారు. త్వరలోనే కేబినెట్ సబ్ కమిటీ జేఏసీ తో చర్చిస్తుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల సాధన కోసం ఉద్యోగులతో పెద్దఎత్తున సదస్సు ఖమ్మంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు రాష్ట్రంలో రోల్ మోడల్‌గా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ, కో-చైర్మన్ లు పీఆర్టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు , రాయల నరసింహారావు, యూటీఎఫ్ సెక్రటరీ పారుపల్లి నాగేశ్వరరావు, టీజీఈజేఏసీ రాష్ట్ర కో- చైర్మన్ దేవరకొండ సైదులు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరి సునీల్ రెడ్డి పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మామునూరి రాజేష్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీజీటీఎస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, ఎంపీటీస్ అసోసియేషన్ మల్లెల రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

బూర్గంపాడు/ భద్రాచలం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి కే.శరత్‌ను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదివారం బూర్గంపాడు మండల పరిదిలోని సారపాకలో గల ఐటీసీ గెస్ట్‌హౌజ్‌కు చేరుకున్న న్యాయమూర్తిని కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పరిస్థితులపై చర్చించుకున్నారు. భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలం వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి ఖాజా శరత్‌ను ఐటీసీ అతిథి గృహంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం వినతిపత్రం అందజేశారు. భద్రాచలంలో మొబైల్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు.


న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

ఇల్లెందు వాసికి డాక్టరేట్

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందుకు చెందిన సింగరేణి మాజీ కార్మికుడు వీవీ. కృష్ణారావు కుమారుడు డాక్టర్ పడాల రాజశేఖర్‌కు డాక్టరేట్ దక్కింది. ఈ నెల 12న తమిళనాడులోని తిరుచిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థ డాక్టరేట్ పట్టాను అందించింది. గోదావరి ఉపనదులైన ముర్రేడు, పెద్దవాగు జలాశయాల స్థిరమైన నీటి వనరులపై అధ్యాయనం చేసి నివేదికను సమర్పించగా ఈ మేరకు డాక్టరేట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముర్రేడు, పెద్దవాగుజలాశయాలు తెలంగాణ- ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని ఈ పరిశోధన స్థిరమైన జలసంబంధిత పరిష్కారాలకు దోహదపడుతుందన్నారు. సింగరేణి ముద్దుబిడ్డగా డాక్టరేట్ పొందడం అభినందనీయన్నారు.

వడగళ్ల వాన.. రైతుల ఆందోళన

- ఉరుములు మెరుపులతో భారీ వర్షం
- నీట మునిగిన వరిధాన్యం

దుమ్ముగూడెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షంతో వరి ధాన్యం నేలరాలి పంట నష్టం జరిగింది. మండలంలోని పర్ణశాల నుంచి గంగోలు వరకు వందలాది ఎకరాల్లో విత్తన, సాదారణ రకం వరి పంటలను రైతులు సాగు చేశారు. నూర్పిడి చేసిన ధాన్యం రాసులు పోసి ఉంచగా కొన్నిచోట్ల అవి తడిచాయి. అలాగే కోతకు వచ్చిన వరి చేలు గాలిదుమారం, వడగళ్లతో గింజలు చేలో రాలిపోయాయి. మిర్చి చివరి కోత పంట కల్లాల్లో ఆరబెట్టగా, అవి కూడా తడిచి రంగు మారే పరిస్థితి తలెత్తింది. కోతకు వచ్చిన జనుము పంటకు సైతం నష్టం వాటిల్లే అవకాశం కనబడుతోంది. పంట నష్టం అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



కరకగూడెంలో ధాన్యం రాసులపై పట్టాలు కప్పుతున్న రైతులు

వరికోతలకు అంతరాయం

అశ్వాపురం(ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం అశ్వాపురంలో గాలి దుమారంతో భారీ వర్షం కురిసింది. అశ్వాపురం,సీతారాంపురం గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. కాగా వర్షంతో మిర్చి,వరి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా తుమ్మలచెరువు ఆయకట్టు కింద రెండు రోజుల క్రితమే వరికోతలు ప్రారంభమయ్యాయి. ఈతరుణంలో వర్షం పడటంతో వరికోతలకు అంతరాయం ఏర్పడనుందని రైతులు పేర్కొంటున్నారు.

ఆందోళనలో రైతులు

బూర్గంపాడు, (ఆంధ్రజ్యోతి): బూర్గంపాడుతో పాటు మోరంపల్లిబంజర, లక్ష్మీపురం, సంజీవరెడ్డిపాలెం, నాగినేనిప్రోలు గ్రామాలలో ముమ్మరంగా యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండల పరిదిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరి కోతలు ప్రారంభించిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టేందుకు గ్రామాలలోని ఖాళీ ప్రదేశాలకు తరలించారు. మండల పరిదిలో భారీ ఈదూరు గాలులు రావడంతో విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడింది. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్లాల్లో తడిసిన ధాన్యం

కరకగూడెం (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాళం కష్టపడి పండించిన పంట చేతకి అందిన దశలో రైతులకు అకాల వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రైతులు ముమ్మరంగా కోతలు కోసి కల్లాల్లో ఆరపోశారు. ఆదివారం మండల వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో కరకగూడెం, అనంతారం, భట్టుపల్లి, పద్మాపురం, కలవలనాగారం, చిరుమళ్ళ, రాయణపేట గ్రామాలలో రైతుల ధాన్యం తడిశాయి. కొందరు రైతులు పట్టాలు కప్పినప్పటికీ ధాన్యం తడిశాయి. మండలంలోని మిర్చి రైతుల మిర్చి తడిసి ముద్దఅయ్యాయి.



దుమ్ముగూడెంలో పట్టాలు కప్పిన దృశ్యం

ఉదయం ఎండ.. సాయంత్రం వాన..

మణుగూరు, (ఆంధ్రజ్యోతి): మణుగూరు డివిజన్‌లో ఓ విచిత్ర మైన వాతావరణ పరిస్థితులను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఉదయం భరించలేని ఎండలతో అల్లాడిపోతుండగా సాయంత్రం అయితే చాలు ఈదురు గాలులు వీస్తూ వెను వెంటనే ఆకాశం అంతా దట్టంగా మోఘాలు అలుముకుని చల్లటిగాలులు ప్రారంభమౌతున్నాయి. దీంతో పాటు ప్రారంభమైన వర్షం కనీసం గంట నుంచి రెండు గంటల పాటు కురవడం ప్రారంభిస్తోంది. ఐదు రోజులుగా ప్రజలు ఈ వింత వాతావరణాన్ని చవి చూస్తూ అనేక ఇబ్బందులకు గురౌతున్నారు. ఇదే కాలం బాబోయ్ అంటూ విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వారం పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కావడిగుండ్లలో నూతనంగా 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా చెన్నాపురం నందు లైన్ల పనులు జరుగుతున్న దృష్ట్యా చెన్నాపురం, కావడిగుండ్ల, కన్నాయిగూడెం, గోపన్నగూడెం, కొత్త కావడిగుండ్ల, కంట్లం గ్రామాలకు సోమవారం నుంచి వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీ వెంకటరత్నం ఆదివారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏడీ వెంకటరత్నం కోరారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణ పోస్టర్ ఆవిష్కరణ

ములకలపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి మండలం మంగలిగుట్ట గ్రామంలో ఈ నెల 21న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవోపేతంజరగనుంది. ఆదివారం గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కల్యాణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త శ్రీ కేదారేశ్వరస్వామి, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, జి. తిరుపతి రెడ్డి, శనగపాటి రవి, జి. రాజు, జి. వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలి

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహారావు పిలుపునిచ్చారు. ఆదివారం జేకే5 ఓసీలో పిట్ పిటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న కార్మికసంఘాలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విదానాలకు వ్యతిరేకంగా మే 20న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. సింగరేణికి పుట్టినిల్లైన బొగ్గుట్టను కాపాడాలని డిమాండ్ చేశారు. సింగరేణి వీకే7 ఓసీ, సత్తుపల్లి ఓసీ 3, కూసపల్లి, కోయగూడెం పిట్3 ప్రాజెక్టులకు పూర్తిస్థాయి అనుమతులను వెంటనే తీసుకు రావాలని కోరారు. సింగరేణి సంస్థద్వారానే బొగ్గు వెలికి తీయాలనే డిమాండ్ చేశారు. ఇల్లెందులో ఖాళీగా ఉన్న సింగరేణి స్థలాలను కార్మికులకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు సీరాజ్ అహ్మద్, బ్రాంచి కార్యదర్శి ఎండి. అబ్బాస్, యూనియన్ రాష్ట్ర నాయకులు రఘురాం, తాళ్లూరి కృష్ణ, కిరణ్, సురేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దెల శివకుమార్‌కు సర్వీసు హైకాన్ అవార్డు

కొత్తగూడెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం పట్టణానికి చెందిన సినీ గీత రచయిత, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్‌కు సర్వీసు హైకాన్ అవార్డు దక్కింది. శనివారం హైదరాబాద్‌లో త్యాగారాయగానసభలో ప్రముఖ వైద్యులు ఫిలాసఫర్, నేషనల్ జర్నలిస్టు డాక్టర్ ఎస్. నరేస్, గౌరవ అతిథిగా శృతియల ఆర్ట్స్ అకాడమి అధినేత నవరసగాయనీమని గాన కోకిల శ్రీమతి అమని చేతుల మీదుగా అందుకున్నారు. హైదరాబాద్ శృతిలయ ఆర్ట్స్‌అకాడమి, రాజన్ ఆర్ట్స్ అకాడమి వారు హైదరాబాద్‌లో నిర్వహించిన పాడాలని ఉన్నది- 5 కార్యక్రమలో డాక్టర్ మద్దెల శివకుమార్ 40 ఏళ్లుగా వారు సంస్కృతిక, సామాజిక, సాహిత్య. దళిత, అధ్యాత్మిక సవేఆ రంగాల్లో అందిస్తున్న విశిష్ఠ సేవలకు గాను సర్వీసు ఐకాన్ విశిష్ఠ అవార్డుతో,సత్కరించి మెమోంటో అందించారు.

భద్రాద్రిలో సర్వమత సమ్మేళనం

భద్రాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆదివారం సర్వమత సమ్మేళనం జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జమాతే ఇస్లామీ హింద్ జిల్లా నాయకులు పారుక్, అబ్దుల్ బాసిత్‌లు మాట్లాడుతూ సమస్త ప్రశంసలు సర్వాన్ని సృష్టించి పాలించేటటువంటి సృష్టికర్తకే శోభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ మునాఫ్, ఫాస్టర్ ప్రవీణ్, రాజా, ముద్దా పిచ్చయ్య, రామలింగేశ్వరారవు, కోట దేవదానం, జాకీర్, లక్ష్మి, లత పాల్గొన్నారు.

ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

భద్రాచలం/ఇల్లెందు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో టీఎస్ యుటీఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్.వి జయ్‌ంకుమార్ పతాక ఆవిష్కరన చేయగా ఈ సందర్భంగా పాల్గొన్న యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల మీద యుటీఎఫ్ రాజీలేని పోరాటాం చేస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఏలు, పీఆర్సీ పెండింగు, బిల్లులు సీపీఎస్ రద్దు వంటి సమస్యలు వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమరం శ్రీనివాస్, ఎం.రమేష్, సైదులు, ప్రసాద్, భారతి, కరుణకుమార్, సీహెచ్ శ్రీనివాసరావు, జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇల్లెందు, (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఇల్లెందులోని యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీనియార్ ఉపాధ్యాయులు రామచంద్రయ్య జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రారంబించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జయరాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు ఏ.రాంబాబు, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కోలాహలంగా ఆలయాలు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 13: మండలంలోని గిరిజన ప్రాంతాల్లో గల అమ్మవారి ఆలయాలు ఆదివారం భక్తులతో కోలాహలంగా మారాయి. మండలంలోని వినాయకపురంలో గల చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం, సరిహద్దున ఉన్న గుబ్బల మంగమ్మ ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. వినాయకపురం ఆలయానికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గుబ్బల మంగమ్మ ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలిరాగా అటవీ ప్రాంతం అంతా భక్తులతో నిండిపోయింది. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణపురం కట్టమైసమ్మ ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

భావితరాలకు బాంధవుడు అంబేద్కర్: ఎస్పీ

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావితరాల బాంధవుడుగా నిలుస్తున్నారని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. మండలంలోని నాగారంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఎస్పీ ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ అణగారినవర్గాల అభ్యున్నత కోసం ఆయన చేసిన కృషి మరువ లేనిదని అన్నారు. చదువు ద్వారానే ఈ సమాజం మారుతుందని చాటిన మహానీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్, గంగపురి శ్రీను, రాయల భాస్కర్, తోకల లింగయ్య (చందు), గంగపురి దుర్గా, గంగపురి చంటి, సిద్దుల గణేష్, సిద్దుల సుధీర్, తోకల ప్రసాద్, దుర్గ ప్రసాద్, ప్రేమ్‌కుమార్, రాజ్, శ్రీకాంత్, కళ్యాణ్, సీతారాములు, దుర్గ, దుర్గారావు, సృజన్, వీరబాబు, ఏసుబాబు, రాములు, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, రంజిత్, పవన్, వినయ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి అంబేద్కర్ జాతీయ పురస్కారం

పాల్వంచ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ లోని డీఏవీ పాఠశాలలో హిందీ పండిట్‌గా పని చేస్తున్న ఎంఎస్‌వీ కృష్ణారావుకు అంబేద్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సధరన్ లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ వారు ఆదివారం గుంటూరు ఏసీ కాలేజీలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, నిర్వహకులు డాక్టర్ నాగయ్య, గుంటూరు ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు నజీర్ అహ్మద్, గల్లా మాధవిల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేసారు. బహుబాషోపాధ్యాయునిగా కృష్ణారావు చేసిన సాహిత్య సృజన, ఉన్నత విద్యాబ్యాసం, సమాజ సేవలకు గాను అవార్డును అందజేసారు. పాల్వంచ ఉపాధ్యాయుడికి జాతీయ పుస్కారం రావడం పట్ల డీఏవీ పాఠశాల ప్రిన్సిపాల్, అద్యాపక బృందం హర్షం వ్యక్తం చేసారు.

తలసీమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరం

భద్రాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మదర్‌తెరిసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తలసీమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారి కోసం రక్తదానం నిర్వహించారు. అనంతరం ట్రస్టు వ్యవస్థాపకులు కొప్పుల మురళీ మాట్లాడుతూ శిబిరంలో 20 మంది రక్తదానం చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జయరాం, ఎడ్విన్ కిషోర్, నవీన్, శ్రీకాంత్, వంశీ, ఆనంద్, ఉమామహేశ్వరరావు, లోకేష్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతం కోసం కృషిచేయాలి



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న నాయకుడు రామయ్య

జూలూరుపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి టీడీపీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని టీడీపీ జిల్లా నాయకులు ఆరెం రామయ్య అన్నారు. ఆదివారం జూలూరుపాడులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పార్టీ సభ్యత్వ కార్డులను నాయకులకు, కార్యకర్తలకు ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ఎన్నికలకు మందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లమల్ల గోవింద్, రోకటి నరసింహారావు, పొదిల రామారావు, కోటం రాజు, సాయిన్ని కృష్ణార్జునరావు, పెంటికల వీరబాబు, శివాజీ, కళ్యాణం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి అగ్నిమాపక వారోత్సవాలు

ఇల్లెందు,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు చైతన్యవంతులు కావాలని డీఎస్పీ చంద్రబాను కోరారు. 14నుంచి20 వరకు జరగనున్న అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను డీఎస్పీ చంద్రబాను, ఆదివారం సీఐ సత్యనారాయణ, ఫైర్ ఆఫీసర్ నవీన్, ఎస్ఐ సందీప్ తో కలిసి ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య రక్షణ కవచం అయినా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో జై బాపు, జై భీం, సంవిధాన్ అభియాన్‌లో కార్యక్రమపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ నియోజకవర్గంలో సాగే రాజ్యాంగ పరిరక్షణ యాత్ర విజయవంతానికి అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ తన మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ రహస్య ఎజెండా అమలు చేస్తూ భారతీయ భావానికి తూట్లు పొడుస్తుందని ఇందులో భాగంగానే మతం దైవం అంటూ రెచ్చగొడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మతాల మధ్య చిచ్చుపెడుతుందన్నారు. సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రవి, మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, రామలక్ష్మయ్య, కొల్లు చంద్రశేఖర్, చెన్నారావుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

దుమ్ముగూడెం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):మండల వ్యాప్తంగా ఆదివారం పలు శుభ, అశుభ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టరు తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. చినబండిరేవులో కావిళ్ల శ్రీను యాదవ్ ఇంట్లో వివాహ వేడుకలోనూ, బైరాగులపాడులోని ములకాల సాగర్-జానుల చిన్నారి వర్షిణి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని వారిని ఆశీర్వదించారు. రామారావుపేటలోని వర్సా రామారావు కుమారుడు చైతన్య దశదిన కర్మల వేడుకల్లో పాల్గొని సానుభూతి తెలిపారు. మాజీ జెడ్పీటీసీ అన్నె సత్యనారాయణమూర్తి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



భద్రాచలంలో పూర్వ విద్యార్థులు..



మణుగూరులో

భద్రాచలం/ మణుగూరు ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని నన్నపనేని ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఒకే చోట కలిశారు. పూర్వ విద్యార్థులంతా తమ జ్ఞాపకాలను నెమరవేసుకోవడంతో పాటు ఎవరెవరు ఏ ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారో ఒకరినొకరు తెలుసుకుంటూ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అలాగే తమకు చదువునేర్పిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు.

మణుగూరు, (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని ఎక్సలెంట్ పాఠశాలలో పైలట్ కాలనీలో 2003 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వెన్నెల జలపాతం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 ఏళ్ల తరువాత పాత విద్యార్థులు మరో మారు కలుసుకోవడం .. పలు రంగాల్లో వారు స్థిరపడటం తమకెంతో సంతోషంగా ఉందని ఎక్సలెంట్ పాఠశాల చైర్మన్ యూసఫ్ షరీఫ్ అన్నారు. కార్యక్రమంలో ఖాదర్, యాకూబ్, భాను, ఖాన్, లెనిన్, సురేష్, రామారావు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్న



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని భద్రాద్రి జిల్లా మహిళా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న అన్నారు. ఆదివారం వికలాంగుల కాలనీలో నిరుపేద లబ్ధిదారురాలు ఇంట ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం భోజనము చేసి మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం కొలువు తీరిన అతితక్కువ కాలంలోనే ప్రజాభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ బోడ దివ్య, వైస్‌ప్రెసిడెంట్ కళ్యాణి, సుశీల, అరుణ, లక్ష్మమ్మ, అనసూర్య, భూక్యా శ్రీదేవినాయక్, నాస్మిన్, సుజాతకీర్తి, సౌజన్య, నాగ, శనగ దీక్షిత, కుక్కమల్ల సౌందర్య, రెక్కల బేబి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం ప్రార్థనలు



కొత్తగూడెం సీఎస్ఐ సెయింట్ ఆంధ్రూస్ చర్చి చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న పాస్టేట్ చైర్మన్ అబిజిత్, కమిటీ సభ్యులు, భక్తులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/భద్రాచలం/జూలూరుపాడు/ అశ్వారావుపేటరూరల్ ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): యేసు ప్రభువును సిలువ వేసి ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కొత్తగూడెం, చుంచుపల్లి ప్రాంతాల్లోని వివిధ చర్చీల్లో ఈ ఆరాధనను క్రైస్తవులు మట్టలను చేత పట్టుకొని చర్చి చుట్టూ ప్రదక్షణలు చేస్తూ, వీదుల్లో తిరుగుతూ నిర్వహించారు. భద్రాచలం, జూలూరుపాడు, అశ్వారావుపేటలోను మట్టల ఆదివారం నిర్వహించారు.

ప్రకృతి ప్రేమికుడికి ఘన నివాళి

జూలూరుపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రేమికుడు పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్య మరణం తీరని లోటని, భావితరానికి ఆయన చూపిన స్ఫూర్తి మరవలేనిదని ఆరోగ్య జీవన యాత్ర(వాకర్స్) సభ్యులు తిప్పర్తి శివ, వేల్పుల బోస్‌లు అన్నారు. ప్రకృతి ప్రేమికుడు వనజీవి రామయ్యకు ఆరోగ్య జీవన యాత్ర వారి ఆధ్వర్యంలో ఆదివారం జూలూరుపాడులో ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. స్థానిక ఎమ్మార్వో కార్యలయంలో మొక్కను నాటారు. వారు మాట్లాడుతూ కోటి మొక్కలు నాటి ప్రకృతి ప్రేమికుడిగా గుర్తింపు పొందారని అన్నారు. రామయ్య మృతితో దేశం గొప్ప ప్రకృతి ప్రేమికుడిని కోల్పోయిందని తెలిపారు. ఆయన మరణం ఈ ప్రకృతికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు రామకృష్ణమాచారి, సభ్యులు వందనపు కమలాకర్, బొడపాటి శంకర్‌రావు, కొండా వెంకటేశ్వర్లు, వేల్పుల నరసింహారావు, వేముల గురునాధం, శ్రీనివాసాచారీ, ఉసికల భాస్కర్, చిలుకూరి కోటేశ్వరరావు, వేముల నాగేశ్వరరావు, పెండ్యాల నరేష్, ఎస్కె. బుడేన్, ఎం.నరసింహారావు, ఎస్కె.ఖాసీం, నవీన్ రాథోడ్, ముదిగొండ వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయం సంతాపం

మణుగూరు, (ఆంధ్రజ్యోతి): తన జీవిత కాలం వన సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తూ కోట్లాది మొక్కలు నాటి పచ్చదనం పర్యావరణంపై జన జాగృతం చేసిన వనజీవి రామయ్య మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాని తెలిపారు. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్ఎస్ పార్టీ వాట్స్ యాప్‌లో తమ సంతాపాన్ని ప్రకటించారు. మణుగూరు గ్రీన్ వారియర్ జేవీఎస్ చంద్ర శేఖర్ వనజీవి రామయ్య మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు.



మొక్క నాటి రామయ్యకు నివాళి అర్పిస్తున్న ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు

పర్యావరణ రక్షణకు తీరని లోటు

కొత్తగూడెం టౌన్, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం తుదిశ్వాస వరకు మొక్కల పెంపకంలో శ్రమించిన వనజీవి మరణం పర్యావరణ పరిరక్షణకు తీరని లోటని గాంధీపథం జిల్లా అధ్యక్షులు చింతలచెర్వు గెర్షోం తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని వనజీవి రామయ్య భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటిమొక్కలు పెంచిన రామయ్య నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని ఆయన ఆశయ సాధన కోసం మొక్కలు పెంచే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్ఞానవి నోదిని, ఎల్జిబెత్ తదితరులు పాల్గొన్నారు.